క్లుప్తంగా

భట్టికి స్వాగతం



విక్రమార్కకు స్వాగతం పలుకుతున్న నేతలు

సుజాతనగర్: రాష్ట్రంలో విస్తారంగా కురిసిన వర్షాలకు గోదావరి నదికి భారీ వరద నీరు చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జలమయమైన గ్రామాలను సందర్శించేందుకు భద్రాచలం వెళుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు ఆధ్వర్యంలో శనివారం సుజాతనగర్‌లో ఘనంగా స్వాగతం పలికారు. చింతలపూడి రాజశేఖర్, చందర్, చిమట నాగేశ్వరరావు, మడిపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌ను పునర్నిర్మించాలి



చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: మండలంలోని నాగారం వద్ద కిన్నెరసాని వాగులో వరద కారణంగా కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను శనివారం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం సందర్శించారు. మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను పునర్నిర్మించాలని, పనులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వరదల కారణంగా రైతుల పంటలకు కూడా నష్టం వాటిల్లిందని వెంటనే సర్వే నిర్వహించి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, జకరయ్య, ఎండీపాషా, శ్రీను పాల్గొన్నారు.

వరద బాధితులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించండి

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో భారీ వర్షం వల్ల నష్టపోయిన ప్రజలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అమర్లపూరి రాము, అధ్యక్షుడు నాయిని రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక ప్రజాపంథా కార్యాలయంలో జరిగింది. మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వరద బాధితుల పరిస్థితి తెలుసుకునేందుకు తీరిక లేదని ఎద్దేవా చేశారు. జి.ప్రభాకర్, నూపా భాస్కర్, వెంకటమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



మల్లన్నను సన్మానిస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంటోందని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని తీన్మార్ మల్లన్న అన్నారు. భద్రాచలం వరద ముంపు ప్రాంతాలను పరిశీలించి తిరుగు ప్రయాణంలో శనివారం ఆయన టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎడవల్లి మల్లన్నను సత్కరించారు. అనంతరం మల్లన్న మాట్లాడారు. ప్రతిఒక్కరూ కష్టపడి పని చేసి కేసీఆర్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, చారి, చంద్రగిరి, సత్యనారాయణ, ఎస్‌కే.షఫీ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



రాళ్లవాగుపై దెబ్బతిన్న కల్వర్టు

టేకులపల్లి: టేకులపల్లి మండలం రాంపురం పంచాయతీ పరిధిలోని రాళ్లవాగు కల్వర్టు ప్రమాదకరంగా మారింది. అసలే ఇక్కడ హైలెవెల్ బ్రిడ్జి లేక వర్షాకాలంలో వరదలు వస్తే రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరదలు వచ్చినప్పుడల్లా కల్వర్టు ధ్వంసం అవుతూ వస్తోంది. తాజాగా కురిసిన వర్షాలకు కల్వర్టుపై గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు నానా తంటాలు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ముస్లింలు మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. హస్సేన్, హుస్సేన్ పవిత్ర యుద్ధంలో ప్రాణాలను కోల్పోవడంతో వారిని స్మరిస్తూ ముస్లింలు జరుపుకునేది పీర్ల పండగ. పీర్ అంటే మహాత్ములు, ధర్మనిర్దేశకులు అని అర్థం. ధర్మ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ప్రతీకగా హస్తాకృతి కలిగిన రూపాలను తయారుచేసి వాటిని అలంకరించి, ఊరేగించి పూజించే వాటిని పీర్లు అని పిలుస్తారు. కొన్ని ప్రాంతాల్లో హిందువులు కూడా పీర్ల పండగను పెద్ద పండగగా భావిస్తారు. హిందూ ముస్లింల సామరస్యమే ఇందుకు కారణం. పదిరోజులుగా కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో పీర్ల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పీర్లకు పూలు, దట్టీలు సమర్పించారు. శుక్రవారం రాత్రి పీర్ల సావడీలోని పీర్లు అన్నీ లేచి అగ్ని గుండంలో నడిచాయి. దీంతో పీర్లు అన్నీ శహదత్ (పీర్లు నీళ్ల గుండంలో మునగడం)తో ఉత్సవాలు ముగిశాయి. శనివారం పీర్లను ఆయా గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. పీర్లకు నీళ్లు వారబోసి పాడిపంటలు బాగా పండాలని, పిల్లాపాపలు సంతోషంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



సుజాతనగర్‌లో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



జూలూరుపాడులో మేళతాళాలతో పీర్ల ఊరేగింపు



పాల్వంచరూరల్: పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



ఇల్లెందురూరల్: పీర్ల చావిడిలో భక్తుల కోలాహలం



తిలక్‌నగర్‌లో పీర్ల ఊరేగింపు



పీర్లకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తురాలు



టేకులపల్లిలో నిమజ్జనానికి బయలుదేరిన పీరీలు



మూడుతండాలో పీర్ల చావిడి వద్ద అన్నదానం



కొత్తగూడెంటౌన్: సూపర్‌బజార్ సెంటర్‌లో..

గని ప్రమాద మృతులకు నివాళి

ఇల్లెందు: 24 ఏరియాలోని స్ట్రట్ ఇంక్లైన్ గనిలో ప్రమాద వశాత్తు మృతి చెందిన ఉద్యోగులు, కార్మికులకు సింగరేణి అధికారులు ఏటా మొహర్రం పండుగ సందర్భంగా నివాళులర్పిస్తారు. వారి స్మారకార్థం నిర్మించిన సమాధుల వద్ద శనివారం సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్, ఇతర విభాగాల అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. 1938లో జరిగిన ఈ ప్రమాదంలో 43 మంది మృతి చెందినట్లు తెలిపారు. ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, ఏజీఎం(ఐడీ) గిరిధర్‌రావు, ఏరియా ఇంజనీర్ ప్రభాకర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీజీఎం విజయశేఖర్ బాబు, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల సందర్శన

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధిలోని పాత కొత్తగూడెంలో ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో వర్షాల వల్ల పునరావాస కేంద్రాలలో ఉంటున్న బాధితులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి శనివారం సందర్శించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయ సహకారాలు, భోజన, ఇతర సదుపాయాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు పులిహోర, బ్రెడ్, అరటిపండ్లు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, జనరల్ సెక్రటరీ రావిలాల రామారావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పురుషోత్తంరావు, డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, నాగ స్రవంతి, జ్యోతి, విశ్వకర్మ, సీనియర్ న్యాయవాదులు మెండు రాజమల్లు, పారా లీగల్ వలంటీర్స్ బి.అనురాధ, బి.రాజమణి, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు పులిహోర, పండ్లు అందజేస్తున్న భానుమతి

వరద బాధితులను ఆదుకుందాం..

ఇల్లెందు: భారీ తుఫాను కారణంగా నష్టపోయి నిరాశ్రయులైన ప్రజలను ఆదుకునేందుకు ప్రజలు సహాయం అందించాలని ఎన్డీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు కోరారు. శనివారం ఎన్డీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో గుండాల ఎంపీపీ, జెడ్పీటీసీ ముక్తి సత్యం, వాగబోయిన రామక్క, తోడేటి నాగేశ్వరరావు, కొక్కు సారంగపాణి, డి.ప్రసాద్, కల్తీ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు సంతు, రజిత, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జెడ్పీ సీఈఓ పర్యటన

చుంచుపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జెడ్పీ సీఈఓ మెరుగు విద్యాలత పర్యటించారు. మొదట పెనుబల్లి గ్రామపంచాయతీలోని గోధుమ వాగు బ్రిడ్జిని సందర్శించారు. వాగు పూర్తిగా తగ్గేంత వరకు వంతెన మీదుగా ప్రయాణం చేయకుండా చూడాలన్నారు. అనంతరం రామాంజనేయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, నందా తండా, చుంచుపల్లి తండా, విద్యానగర్ గ్రామ పంచాయతీల్లో లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పర్యవేక్షించి సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఇంటింటికీ చెత్త సేకరణ, కాల్వలు, డ్రెయినేజీలను శుభ్రం చేయించుట, పిచ్చి మొక్కలు తొలగించటం, బ్లీచింగ్ చల్లించడం పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. ఎంపీడీఓ మందా మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు అజ్మీర ఇందిర, జరుపుల రవి, బి.వసంతకుమారి, సత్యనారాయణ, కార్తీక్, బాబూరావు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో పల్లెల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పలు గ్రామాలలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి దోమల నివారణ మందును చల్లాలని, ప్రతి వీధిలోనూ బ్లీచింగ్ పౌడర్ చల్లాలని చెప్పారు.



చుంచుపల్లి తండాలో పనులను పర్యవేక్షిస్తున్న సీఈఓ విద్యాలత



ఇల్లెందురూరల్: ఒడ్డుగూడెంలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్

పాఠశాలల్లోకి అనుమతి నిషేధించడం దారుణం

జూలూరుపాడు: ప్రభుత్వం పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలు, మీడియాను నిషేధించడం దారుణం అని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. ఇలాంటి చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బీజేపీ గిరిజనులను రెచ్చగొడుతోంది..

జూలూరుపాడు: గిరిజనుల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడటం తగదని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ మధు శనివారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని, మణిపూర్ తరహాలో పోరాటం చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ బాపూరావు ప్రకటించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివాసీ గిరిజనులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకే బీజేపీ నాటకం ఆడుతోందని పేర్కొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న జీపీ కార్మికులు

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 24వ రోజుకు చేరుకుంది. తమ ఆందోళనను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంపై కార్మికులు శనివారం వినూత్న నిరసనకు తెలిపారు. రేపల్లెవాడ గ్రామపంచాయతీ పరిధిలో భారీ వర్షాలకు కల్వర్టు కుంగిపోయింది. నల్ల బ్యాడ్జిలు ధరించి కల్వర్టు వద్దకు చేరుకేని కార్మికులు స్వచ్ఛందంగా మరమ్మతులు చేశారు. కార్మికులు నర్సింహారావు, మోహన్‌రావు, శ్రీను, రాధాకృష్ణ, రంజిత్, ఝాన్సీ, సుమలత, నాగరాజు, వీరబాబు, కిరణ్, వంశీ, సర్వేష్, తిరుపతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రంగాపురం బ్రిడ్జి వద్ద..

పాల్వంచరూరల్: మండలంలోని రంగాపురం కిన్నెరసాని వాగుపై గల బ్రిడ్జి వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన ప్రదేశంలో ఏర్పడ్డ గండిని కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం హైవే అధికారులు మరమ్మతులు చేపట్టారు. బ్రిడ్జి పక్కన కోతకు గురైన ప్రదేశంలో సిమెంట్, ఇసుక బస్తాలు వేసి గండిని పూడ్చివేశారు.

నీటి తరలింపు దారుణం

ఇల్లెందు: ఏజెన్సీ ప్రాంతాన్ని ఎండబెట్టి ఖమ్మం నుంచి ఆంధ్రాకు నీళ్లు ఇవ్వటం దారుణమని, భక్త రామదాసు ప్రాజెక్టు మీద ఉన్న ప్రేమ సీతారామ రోళ్లపాడు ప్రాజెక్టు మీద లేకపోవటం సీఎం కేసీఆర్ వివక్షకు నిదర్శనం అని ఇల్లెందులోని పెన్షనర్ భవన్‌లో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగిన రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ఆరోపించారు. శనివారం జరిగిన ఈ సమావేశంలో ఎన్డీ చంద్రన్న వర్గం రాష్ట్ర నాయకుడు గొని ఐలయ్య మాట్లాడుతూ.. 2016లో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు అడ్రస్ లేకుండా పోయిందన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలోని టేకులపల్లిలో ఉన్న రోళ్లపాడు ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నీరందించాల్సి ఉండగా దాన్ని మార్చి ఖమ్మం ద్వారా ఆంధ్రాకు నీరు తరలించే ప్రయత్నం జరుగుతోందన్నారు. సీఎం కేసీఆర్ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. జిల్లాకు తీరని అన్యాయం జరుగుతుంటే ఎమ్మెల్యేలు మౌనంగా ఉండడమేమిటని ప్రశ్నించారు. ఈ సమస్యపై అగస్టు 1న ఇల్లెందులో అఖిల పక్ష రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ఎన్డీ జిల్లా నాయకులు యదళ్లపల్లి సత్యం అధ్యక్షత వహించగా సీపీఐ, సీపీఎం నేతలు బంధం నాగయ్య, డి.శంకర్, ఎస్‌పీ నబీ, ప్రజాపంథా నాయకులు బోస్, టీడీపీ నేత వంశీ, కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, జే.సీతారామయ్య, ఊక్లా, మోకాళ్ల రమేష్, మహబూబ్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాసుద్దీన్, బయ్యా శారద, ఉమా, కె.శ్రీనివాస్, ఎల్.రవి, నర్సింగ్, గణేష్, పీకే వెంకయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొని ఐలయ్య

మరమ్మతులకు నిధులు కేటాయించండి



పెనుబల్లి వంతెనను పరిశీలిస్తున్న నాయకులు

చుంచుపల్లి: భారీ వర్షాలకు ధ్వంసమైన గ్రామీణ రహదారులు, వంతెనలు, కల్వర్టుల పునరుద్ధరణకు తక్షణమే నిధులు విడుదల చేసి రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామ సరిహద్దులో ఉన్న వంతెనను శనివారం సీపీఐ నేతల బృందం సందర్శించారు. సాబీర్‌పాషా మాట్లాడుతూ.. పది రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని అనేక చోట్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు దెబ్బతినడంతో రాకపోకలు స్తంభించి ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారిందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లే కూలీలు ఉపాధి కోల్పోయి పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అంచనాలు, సర్వేలతో కాలం వెళ్లదీయకుండా తక్షణమే నిధులు కేటాయించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. వాసిరెడ్డి మురళి, రెడ్డి శ్రీను, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కిలారు ప్రసాద్, కొమ్ము వెంకన్న, భాగ్య, కె.రామారావు, ముఖేష్, పోలవరపు శరత్, భద్రయ్య, మీసాల వెంకన్న, దొప్ప రామారావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జూలూరుపాడు: జిల్లాలో అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర కార్యదర్శి చంద్ర నరేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జూలూరుపాడు మండలం గుండెపుడి, రామచంద్రాపురం, నల్లబండబోడు, కాకర్ల, మొద్దులగూడెం గ్రామాల్లో తెలంగాణ రైతు సంఘం ప్రతినిధుల బృందం పర్యటించి, అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మాట్లాడుతూ.. మండలంలో వేలాది ఎకరాల్లోని పత్తి పంట, మిరప నారు మడులు దెబ్బతిన్నట్లు చెప్పారు. రైతులకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. గుండెపిన్ని వెంకటేశ్వర్లు, చింతా స్వరాజ్‌రావు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, ఎస్కే చాంద్‌పాషా, బోగిన్ని వెంకటేశ్వర్లు, తూము కోటయ్య, బానోత్ రాములు, హళావత్ భద్రు, గాదె వెంకటేశ్వర్లు, వీరయ్య, రైతులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఒక్కసారిగా ఎత్తివేయడం వలన నదీ పరివాహక ప్రాంతంలో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు కాపా కృష్ణమోహన్ అన్నారు. శనివారం రంగాపురం, నాగారం గ్రామాల్లో పర్యటించారు. వరదకు కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్, మామిడితోట, కోతకు గురైన కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో వడ్లమూడి పూర్ణచందర్‌రావు, కనుకుంట్ల కుమార్, తారచంద్, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడు: దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం ప్రతినిధుల బృందం

మొక్కలు నాటి సంరక్షించండి



మొక్క నాటుతున్న చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: మొక్కలు నాటి కాలుష్యాన్ని తగ్గించాలని సింగరేణి లైజన్ ఆఫీసర్ కలవల చంద్రశేఖర్ అన్నారు. శనివారం లయన్స్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా శ్రీనగర్ గ్రామ పంచాయతీ ఐదో లైన్‌లో మొక్కలు నాటారు. మాట్లాడుతూ.. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ సంస్థ అధికారులు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ నిర్మూలన నినాదం ఇచ్చిందని, అలాగే జూలై 23 నుంచి 31 వరకు మొక్కలు నాటి పర్యావరణ రక్షణకు ప్రతీఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. భూమి, ధ్వని, వాయు, నీటి కాలుష్యాలు పెరుగుతున్నందున నివారణ కొరకు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ కూర శ్రీధర్, లయన్స్ క్లబ్ కార్యదర్శి లగడపాటి రమేష్, కోశాధికారి చెరుకు శ్రీనివాస్, జిల్లా చైర్మెన్ పల్లపోతు శ్రీనివాస్, కొయ్యడ నగేష్, మైనేని మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సింగరేణి(కొత్తగూడెం): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ వార్డుల్లో తక్షణ చర్యలు చేపట్టాలని, బాలింతలు శుద్ధి చేసిన మంచినీటిని అందించాలని పదో వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ అన్నారు. శనివారం పలు వీధుల్లో పేరుక పోయిన చెత్తచెదారాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ.. వర్షాల కారణంగా దోమలు, క్రిమికీటకాలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన విష జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ అంతర్భాగమైన రామవరం ఏడు వార్డుల్లో ఫాగింగ్ చేయాలని, బ్లీచింగ్ చల్లాలని సూచించారు. కార్యక్రమంలో తునికిపాటి పూర్ణాచారి, ముద్దం మార్తమ్మ, తునికి పాటి రత్నకుమారి, ఎలిశమ్మ, చిలకలూరి సుప్రియ, ముంతాజ్ తదితరులు పాల్గొన్నా రు.



సింగరేణి(కొత్తగూడెం): డ్రెయినేజీని పరిశీలిస్తున్న వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ

పునరావాస కేంద్రంలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్ ఎన్.బలరామ్ పుట్టినరోజు సందర్భంగా సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల వరదలతో పాత కొత్తగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉంటున్న వారికి దుప్పట్లు అందజేశారు. తొలుత అసోసియేషన్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీఎస్‌కే.శర్మ, సింగరేణి అధికారులు దామోదర్‌రావు, అందెల ఆనందరావు, శ్రీకాంత్, పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్‌తో పాటు పరమేష్, హన్మంతు, ఆంతోటి నాగేశ్వరరావు, కలవల చంద్రశేఖర్‌రావు, బందెల విజేందర్, ఊట్ల గణేష్, మోరే రమేష్‌కుమార్, బి.రామారావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.